





భక్తులతో రద్దీగా గద్దెల ప్రాంగణం

ముగిసిన మినీ సంబురం

చివరి రోజూ గద్దెల వద్ద జనం సందడి

- నాలుగురోజుల్లో సుమారు 10లక్షల మంది భక్తుల రాక
- తిరుగువారం పండుగకు సిద్ధం

వనదేవతల చిన్న జాతర ముగిసింది. 12వతేదీ బుధవారం మండమెలుగు పండుగతో ప్రారంభమైన ఈ మినీ జాతర కన్నుల పండువగా సాగింది. ఈ నాలుగురోజుల్లో సుమారు 10లక్షల మంది భక్తులు ఆ తల్లుల దర్శనానికి తరలిరాగా.. శనివారం 50వేల మంది దర్శించుకున్నారు. ఈ మినీ సంరంభం ముగియడంతో సంప్రదాయంలో భాగంగా వచ్చే బుధవారం నిర్వహించబోయే తిరుగువారం పండుగకు పూజారులు సన్నద్ధమవుతున్నారు. ఇక ఆదివారం సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో యంత్రాంగం ఆమేరకు ఏర్పాట్లు చేసింది.

7

- తాడ్వాయి, ఆంధ్రజ్యోతి

ప్రాణాలతో చెలగాటం

- ఓపెన్‌కాస్టులో నిత్యం ప్రమాదాలు
- ట్రక్కుడ్రైవర్లపై తీవ్ర పని ఒత్తిడి
- మానసిక ప్రశాంతత కరువు
- తప్పుతున్న బ్యాలెన్స్.. బోల్తా పడుతున్న వాహనాలు
- గోప్యత పాటిస్తున్న అధికారులు


గణపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఏరియా సింగరేణి ఓపెన్‌కాస్టు-3లో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకోవడం కలవరం రేపుతోంది. నిత్యం ట్రక్కులు బోల్తాపడుతుండటంతో డ్రైవర్ల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని తెలుస్తోంది. కాంట్రాక్టరు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, పని ఒత్తిడిని పెంచడం వల్ల ఈ ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయనే విమర్శలు వస్తున్నాయి. గడిచిన వారం రోజుల్లో ఇలాంటి ఘటనలు ఆరు చోటుచేసుకున్నాయి. ఇవేకాకుండా కొన్ని రోజుల క్రితం ఓ డ్రైవర్ మృతి చెందాడు. ఇలా వరుస ఘటనలతో డ్రైవర్లలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

భూపాలపల్లి ఏరియాలోని గణపురం మండలం పరుశురాంపల్లి సమీపంలో ఉంది ఓపెన్ కాస్టు ప్రాజెక్టు-3. ఇక్కడ వోల్వో ట్రక్కు డ్రైవర్లకు అధిక పనిభారం పడుతోందనే విమర్శలు వస్తున్నాయి. నిర్దిష్ట డ్యూటీలు అంటూ లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు పనిచెబుతున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు... అదనంగా మూడు షిఫ్టుల్లో ఓసీలోని ఓబీ పనులు చేస్తుండటం, రాత్రి విధుల్లో కనీసం టీ సమయంలో కూడా విరామం లేకుండా పనులు చేయిస్తున్నారని అంటున్నారు. దీంతో తీవ్రంగా అలసిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర పని వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నామని, దీంతో బ్యాలెన్స్ తప్పి వాహనాలు బోల్తాపడటంతో ప్రమాదాలకు గురవుతున్నామని తెలిపారు.

ప్రమాదాలు ఎలాంటివంటే...

ఓసీ-3లో బొగ్గు ఉత్పత్తితో పాటు మట్టితీసే పనులు కూడా ముమ్మరంగా జరుగుతుంటాయి. మూడు షిఫ్టుల్లో సుమారు 300 మంది డ్రైవర్లు, మిషన్ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. ప్రతి షిఫ్టులో ఐదు వోల్వో ట్రక్కులకు ఒక షావెల్ (మట్టితీసే యంత్రం) పనిచేస్తోంది. సంస్థ నిబంధనల ప్రకారం ఒక ట్రక్కు 9లేదా 10 ట్రిప్పుల మట్టిని మాత్రమే తరలించాల్సి ఉంది. కానీ దానిని అతిక్రమించి ఒక్కో ట్రక్కును 20 నుంచి 28 ట్రిప్పుల వరకు తీయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అంతేకాకుండా డ్యూటీ దిగే సమయంలో తక్కువ ట్రిప్పులు చేరవేస్తే మస్టర్ క్యాన్సిల్ చేస్తామంటూ కాంట్రాక్టరు సంస్థకు చెందిన ఉద్యోగులు బెదిరింపులకు గురిచేస్తున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక వాహనాల వేగం పెంచాల్సి వస్తుందని, దీంతో ప్రమాదాల బారిన పడుతున్నామని అంటున్నారు. అంతేకాకుండా ట్రక్కులకు పైభాగంలో పట్టీలుపెట్టి మరీ ఓవర్‌లోడ్ వేసి ప్రమాదాలకు కారణమవుతున్నారని ఆరోపిస్తున్నారు. రాత్రి విధుల్లో టీ బ్రేక్ ఇచ్చినప్పుడు కనీసం అరగంట కూడా రెస్ట్ ఇవ్వడం లేదని అంటున్నారు. అంతేకాకుండా ఓబీ మట్టిని ఇన్‌డంపింగ్ చేయాల్సి ఉండగా కాంట్రాక్టు సంస్థకు చెందిన ఉద్యోగులు మాత్రం ఔట్ డంపింగ్ చేయాలంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు డ్రైవర్లు చెబుతున్నారు. ఇలా అనేక రకాలుగా ఒత్తిళ్ల పెంచడంతో రెస్టు లేక నిత్యం ప్రమాదాలకు గురవుతున్నామని తెలిపారు. గత నెల 3న వోల్వో డ్రైవర్ మృతి చెందడం, వారం రోజులుగా ఆరు ట్రక్కులు బోల్తాపడుతుండడంతో కార్మికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.





ఓపెన్‌కాస్టు వ్యూ

పేలుతున్న డిటోనేటర్లు

ఓసీలోంచి బొగ్గును వెలికితీసేందుకు డిటోనేటర్లతో (మందుపాతర) ఉపయోగిస్తారు. ఈ క్రమంలో పేలని డిటోనేటర్లు బొగ్గు సహా పైకి లేచి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఒక్కోసారి ఓసీ ఆవరణలో డంప్ చేసిన బొగ్గును షావెల్ యంత్రాలతో టిప్పర్లలో పోస్తుండగా ప్రమాదవశాత్తు అందులో ఉన్న డిటోనేటర్లకు తాకి పేలుతున్నాయని కార్మికులు అంటున్నారు. ఇలాంటి సంఘటన నాలుగు రోజుల క్రితం జరగ్గా షావెల్ డ్రైవర్ భయాందోళనకు గురై ఘటనా స్థలం నుంచి పరుగులు తీశాడు. షావెల్ అద్దాలు మాత్రమే పగిలి ఎలాంటి ప్రాణ హాని కలగకపోవడంతో అధికారులు, డ్రైవర్లు ఊపిరిపీల్చుకున్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీఆర్ఎస్ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి
- ఎమ్మెల్యే సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని జూకల్లు శివారులో ఓ ఫంక్షన్‌హాల్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి అధ్యక్షతన శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా 18 గంటలు కష్టపడుతున్నామని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ. 6 లక్షల కోట్లకు వడ్డీలు చెల్లిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సింగపూర్ కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని అన్నారు. నిజాయితీగానే రాష్ట్ర ప్రభుత్వం పాలనను కొనసాగిస్తోందని, ఓర్వకనే ఇలాంటి అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం, కుల గణన చేయలేదని, రాష్ట్రంలో మాత్రం ఇక్కడి నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కష్టపడి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. పార్టీ అనుబంధ కమిటీలను వెంటనే పూర్తిచేయాలని, కార్యకర్తలకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈసమావేశంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవీ సత్యనారాయణ, జిల్లా నాయకులు మధు వంశీకృష్ణ, దొడ్డి కిష్టయ్య, మాజీ జడ్పీటీసీలు పులి తిరుపతిరెడ్డి, కాత్రేవుల సాయిలు, ఓరం సమ్మయ్య, నాయకులు శంకర్, పింగిళి జ్యోతి, కుమారస్వామి, బుర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అడవుల్లోనే పులి సంచారం!

- 15 కిలోమీటర్ల రేడియస్‌లో తిరుగుతున్న భారీ పులి?
- పలు చోట్ల పులి పాదముద్రల ఆనవాళ్ల గుర్తింపు
- అడవుల్లో పులి జాడ కోసం 8 బృందాలుగా అటవీ శాఖ అధికారులు జల్లెడ



అన్నారం అడవుల్లో పులి పాదముద్ర

కాటారం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ డివిజన్ అడవుల్లోనే పెద్దపులి సంచరిస్తున్నట్టు తెలుస్తోంది. వారం రోజులుగా 15 కిలోమీటర్ల రేడియస్‌లోని అడవుల్లో తిరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. అడవుల్లోని పలుచోట్ల వాగుల వద్ద పెద్దపులి పాదముద్రలు (పగ్‌మార్క్స్) ఆనవాళ్లు శనివారం కనిపించాయి. దీంతో డివిజన్ అడవుల్లోనే పులి సంచరిస్తున్నట్లు ఫారెస్టు అధికారులు తేల్చారు. శుక్రవారం రాత్రి ఆటోలో ఊర పందులను తరలిస్తున్నవారికి బీరసాగర్ అడవుల్లో పెద్దపులి రోడ్డు దాటుతూ కనిపించినట్లు ఆనోట ఈనోట అటవీ అధికారులకు తెలిసింది. దీంతో శనివారం మహదేవపూర్, కాటారం ఎఫ్ఆర్వోలు రవి, స్వాతి, కాటారం, మహదేవపూర్, యామన్‌పల్లి డిప్యూటీ రేంజర్లు సురేందర్, రాజేశ్వర్, శ్రీనివాస్, ఎఫ్ఎస్‌వోలు చంద్రశేఖర్, సుమన్, వరుణ్ నేతృత్వంలో ఇరు రేంజ్‌ల పరిధిలోని అటవీ అధికారులు సిబ్బంది అడవులను జల్లెడ పట్టారు. పులి బీరసాగర్ అడవుల నుంచి అన్నారం అడవుల్లోకి వెళ్లినట్లు పలు చోట్ల వాగు, వంకల్లో పాదముద్రలు కనిపించాయి. ఈ నేపథ్యంలో అడవుల్లోకి ఎవరూ వెళ్లొద్దని ఫారెస్టుఅధికారులు హెచ్చరిస్తున్నారు. పాదముద్రలు పెద్దగా కనిపిస్తుండటంతో భారీ పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది.

వారం రోజులుగా పులి అడవుల్లోనే సంచరిస్తుండటంపై అధికారులు, టైగర్ ట్రాకర్స్ పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పులుల మేటింగ్ పీరియడ్ కావడంతో మగ పులి ఇటు వచ్చిందా? గర్భిణిగా ఉన్న ఆడపులి సురక్షిత ప్రాంతం వెదుకుతూ ఇటు వైపు వచ్చిందా? అనే అనుమానాలు వ్యక్తవుతున్నాయి. పులిని గాలిస్తున్న బృందాల్లో అటవీ అధికారులు సంజీవ్, అశోక్, రాజ్‌కుమార్, బేస్ క్యాంప్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది, ప్లాంటేషన్ల వాచర్లు తదితరులు ఉన్నారు.

చంద్రశేఖర స్వామి ఆలయంలో పూజలు

మహదేవపూర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో వెలిసిన చంద్రశేఖర ఆలయంలో శనివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మహన్యాసక నగరం లక్షపత్రి పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. 20 మంది అర్చకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణం కోసం ఈ పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు.

‘పీఎంశ్రీ’ స్కూల్స్‌లో సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యా శాఖఅధికారులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. పీఎంశ్రీ నిధుల వినియోగం, సమగ్రశిక్ష నిధుల వ్యయం, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధన, అపార్ నమోదు, డీఎస్సీ 2008 అభ్యర్థులకు నియామక పత్రాల జారీ తదితర అంశాలపై సమీక్షించారు. పీఎంశ్రీ పథకంకింద జిల్లాలోని టీఎస్ఎంఎస్ మల్హర్, జడ్పీహెచ్ఎస్ టేకుమట్ల, కాళేశ్వరం, గొల్లబుద్దారం, చెల్పూర్, టీఎస్‌డబ్ల్యూఆర్ఈఎస్ చిట్యాల, టీఎస్ఎంఎస్ గణపురం, ఎంపీపీఎస్ యమన్‌పల్లి పాఠశాలలు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీటిలో అభివృద్ధి పనుల కోసం రూ. 73,76,640 మంజూరు కాగా ఇప్పటి వరకు రూ.49,29,356 ఖర్చు చేసినట్లు తెలిపారు. మిగిలిన పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పీఎంశ్రీ నిధులతో చేపట్టిన కార్యక్రమాలతో డాక్యుమెంట్ తయారు చేయాలన్నారు. పాఠశాలల్లో అత్యవసర సేవల ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలన్నారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలన్నారు. సమయం ఉన్నందున సబ్జెక్టుల్లో వెనుకంజ ఉన్న విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్నారు. నమూనా పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు పరీక్షల పట్ల భయం పోగొట్టాలన్నారు. డీఎస్సీ 2008లో ఎంపికైన అభ్యర్థులు జిల్లాలో 43 మంది ఉన్నారని, వారందరి విద్యార్హతలు పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నియామకాలు చేపట్టాలన్నారు. విద్యార్థుల నమోదు ఆపార్ ప్రక్రియ 58శాతం పూర్తయ్యిందన్నారు. మిగిలింది కూడా పూర్తి చేయాని అన్నారు. ఈకార్యక్రమంలో డీఈవో రాజేందర్, ఎఫ్ఏవో కార్తీక్, ఎంపీఓలు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



కొమురయ్య (ఫైల్)

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పంట కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై బి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్సిపేట గ్రామానికి చెందిన రైతు పండగ కొమురయ్య(65) తన పదెకరాల వ్యవసాయ భూమిలో మూడెకరాల్లో మిర్చి పంట, మిగతా భూమిలో పత్తిపంట సాగుచేశాడు. దీనికి సుమారు రూ. 20 లక్షల అప్పు చేశాడు. దిగుబడి రాక పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది మిర్చిపంట వద్దకు వెళ్లి పురుగులమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హనుమకొండ జిల్లా పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఇసుక రీచ్‌ను పరిశీలించిన అధికారులు

మల్హర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని మల్లారంలోని ఇసుక రీచ్‌ను వరంగల్ మైనింగ్ అడిషనల్ డైరెక్టర్ రవిశంకర్ శనివారం పరిశీలించారు. ఇసుక రీచ్‌లో చేపడుతున్న లోడింగ్‌ను తనిఖీ చేసి, డీడీలను పరిశీలించారు. రీచ్‌ల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీచ్‌లను నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఇసుక డీడీలను పరిశీలిస్తున్న మైనింగ్ ఏడీ రవిశంకర్

డాబా పైనుంచి జారిపడి యువకుడి మృతి

కురవి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటి స్లాబ్‌పై నిద్రిస్తున్న వ్యక్తి నిద్రమత్తులో లేచి పైనుంచి జారిపడి మృతి చెందాడు. ఈ సంఘటన కురవి మండలం చంద్రుతండాలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కురవి మండలం నేరడ గ్రామ శివారు చంద్రుతండాకు చెందిన ధరంసోత్ శంకర్(38) శుక్రవారం రాత్రి తన ఇంటి స్లాబ్‌పై కుటుంబసభ్యులతో కలిసి నిద్రిస్తున్నాడు. మధ్యరాత్రి మూత్ర విసర్జన కోసం లేసిన శంకర్ నిద్రమత్తులో ప్రమాదవశాత్తు స్లాబ్ పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. శంకర్ మృతి చెందాడు. మృతుడి తండ్రి హర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పత్తిలోడు వ్యానును ఢీకొన్న లారీ



రోడ్డుపై బోల్తాపడ్డ వ్యాన్

ములుగు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ములుగు సమీపంలోని గట్టమ్మ దేవాలయం మూలమలుపు వద్ద 163 జాతీయ రహదారిపై శనివారం ప్రమాదం జరిగింది. ఏటూరునాగారంనుంచి హనుమకొండ వైపు పత్తిలోడుతో వెళ్తున్న డీసీఎంను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. డీసీఎం బోల్తాపడగా పత్తి రోడ్డుపై పడింది. డ్రైవర్‌కు గాయాలు కాగా ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతుండగా కొద్దిసేపు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. పోలీసుల చొరవతో డీసీఎంను పక్కకు తొలగించారు.

ఇసుక క్వారీల్లో ఆగని తనిఖీలు

- నిఘా నీడలో విక్రయాలు
- శశాంక పర్యటనతో పీవోపై వేటు
- కొత్త పీవోగా శ్రీరంగారెడ్డి

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి పరిధిలోని ఇసుక క్వారీల్లో తనిఖీలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో నిరంతరం ఈ తనిఖీలు చేపట్టడంతో ఇసుకాసురుల్లో వణుకు పుడుతోంది. పాసింగ్ లారీలను లోడ్ చేసేందుకు వెనుకాడుతున్నారు. లోడ్ అయిన లారీలను సైతం మహదేవపూర్ నుంచి మొదలు వరంగల్, హైదరాబాద్ వరకు నిత్యం పోలీసు, ఆర్టీఏ అధికారులు తనిఖీ చేస్తుండటంతో లోడింగ్‌కు వచ్చే లారీల సంఖ్య తగ్గుతోంది. వెరసి ఇసుక క్వారీల్లో ఇసుక బుకింగ్ కావడం లేదు. అందుబాటులో ఉంచిన క్వాంటిటీ ఏమాత్రం అమ్ముడుపోవడం లేదు. ఒకట్రెండు స్టాక్ యార్డుల్లో తప్ప క్వాంటిటీ ఏమాత్రం తగ్గడం లేదు.

వారం రోజుల్లో తనిఖీల పర్వం

జిల్లాలో ఉన్న 14 ఇసుక క్వారీల్లో వారం రోజుల పరిధిలో రాష్ట్ర స్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఫిబ్రవరి 1న కలెక్టరు రాహుల్ శర్మతో కలిసి మైనింగ్ కమిషనర్ శశాంక కలిసి తనిఖీ నిర్వహించారు. ఈనెల 14న ఇంటలిజెన్స్ ఎస్పీ భాస్కర్ పూర్తి స్థాయిలో విచారణ జరిపారు. వీరితో పాటు జిల్లా స్థాయిలో రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి మెరుపు దాడులు చేస్తున్నారు. ప్రతి లోడింగ్ పాయింట్ వద్ద ఒక రెవెన్యూ, పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తున్నారు. వీరితో పాటు మైనింగ్ ఏడీ జయరాజ్ సైతం క్వారీల్లో తనిఖీలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్ర మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సైతం నేడో, రేపో ఇసుక క్వారీలను స్వయంగా పరిశీలించనున్నట్లు తెలిసింది.



బొమ్మాపూర్ క్వారీలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై

పీవోపై వేటు.. కొత్తగా శ్రీరంగారెడ్డికి బాధ్యతలు

ఇసుక క్వారీల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయి అధికారులు క్వారీల్లో తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. మైనింగ్ కమిషనర్ శశాంక ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రస్తుత పీవో కె.శ్రీరాములు వేటు పడింది. ఆయనను నల్లగొండ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో కొత్తగా నల్లగొండ పీవో సి.శ్రీరంగారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



నర్సింహులపేటలోని పీఏసీఎస్ భవనం ఎదుట యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం బారులు..

- సకాలంలో అందకపోవడంతో రైతుల ఇబ్బందులు

నర్సింహులపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) భవనం ఎదుట యూరియా బస్తాల కోసం వివిధ గ్రామాల రైతులు శనివారం బారులు తీరారు. కొందరు రైతులకు బస్తాలు దొరకకపోవడంతో నిరుత్సాహంగా వెనుదిరిగారు. నర్సింహులపేట మండలంలో సీజనల్‌గా రైతులకు సరిపోయేంత యూరియా అందుబాటులో లేకపోవడంతో కొంత కాలంగా యూరియా బస్తాల కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు. పీఏసీఎస్, ఆగ్రోస్ సెంటర్లలో ఇప్పటివరకు 6వేల యూరియా బస్తాలను రైతులు కొనుగోలు చేశారు. వరి, మొక్కజొన్న, పెసర, మిర్చి సాగు అధికంగా ఉండడంతో మరో 5వేలు యూరియా బస్తాలు దిగుమతి చేస్తేనే రైతులకు ఇబ్బందులు తప్పుతాయని రైతు సంఘాల నాయకులు తెలుపుతున్నారు. యూరియా కొరతపై ఏవో వినయ్ కుమార్‌ను వివరణ కోరగా మండలంలో యూరియా కొరత లేదన్నారు.

రామప్ప ఆవరణలో మాంసాహార కలకలం!

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ఆగ్రహం వ్యక్తం చేసిన పర్యాటకులు, స్థానికులు

వెంకటాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : చారిత్రాత్మక రామప్ప ఆలయం ఆవరణలో ఓ పాఠశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పిక్నిక్ వివాదానికి దారి తీసింది. విహార యాత్రకు వచ్చిన విద్యార్థులకు ఆలయ ఆవరణలోనే మాంసాహారం వడ్డించడంపై కలకలం రేపింది. విద్యార్థులు చికెన్ బిర్యాని తింటున్న దృశ్యాల వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో రామప్ప ఆలయాన్ని సందర్శించిన కొందరు హిందూ కార్యకర్త లతో పాటు స్థానికులు, పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ లో స్థానం పొందిన దేవాలయంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం దారుణమని, విద్యార్థులకు చికెన్ బిర్యాని వడ్డించిన ఉపాధ్యాయులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విద్యార్థులు జనగామ జిల్లాలోని ఓ పాఠశాలకు చెందిన వారని తెలిసింది.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత

పెద్దవంగర, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత సూచించారు. శనివారం మండల కేంద్రంతో పాటు చిన్నవంగర ప్రభుత్వ పాఠశాలలో, కేజీబీవీ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే మంచి సమాజాన్ని నిర్మించుకోగలమన్నారు. ఉచిత న్యాయ సహాయం, గృహహింస చట్టం, మెంటెయిన్స్, న్యాయసేవ సంస్థ, అందించే సేవలతో పాటు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయం ప్రతి ఒక్కరీ హక్కు అని, రాజ్యాంగ అందరికీ సమాన హక్కులను కల్పించిందన్నారు. ప్రతి ఒక్కరికీ చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు తొందరపడి వివాదాలు పెట్టుకోవద్దన్నారు. యువత ముఖ్యంగా చెడు మార్గంలో వెళ్లకుండా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్న ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ వ్యక్తిగత బ్యాకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. గ్రామాల్లో ఎవరైన బాల్య వివాహాలు, చట్టాలకు విరుద్ధంగా పనిచేసినా వెంటనే 100 డయల్, 1098 సమాచారం అందించాలని తెలిపారు. ఇన్‌చార్జ్ ఎస్సై రాంజీనాయక్, ఇన్‌చార్జ్ హెచ్ఎం రాజలింగం, ఎస్‌వో స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానుకోటలో టెన్షన్.. టెన్షన్..

- ఉత్కంఠగా సాగిన సేవాలాల్ జయంతి వేడుకలు
- ప్రశాంతంగా ముగియడంతో ఊపిరిపీల్చుకున్న పోలీసులు

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : బంజారాల ఆరాధ్య దైవం.. సద్గురు సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి వేడుకలు మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో శనివారం ఉత్కంఠత నడుమ కొనసాగాయి. మహబూబాబాద్‌లో ప్రస్తుత ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అనుచరుల మధ్య అలజడి నెలకొనడంతో సేవాలాల్ జయంతి ఉత్సవాలు టెన్షన్.. టెన్షన్‌గా జరిగాయి. మహబూబాబాద్ శివారు అనంతాద్రి సేవాఘడ్ వద్ద సేవాలాల్ ఆలయంలో జయంతి వేడుకలను గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇరువర్గాలు జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు వారి.. వారి అనుచరులతో అనంతారం సేవాఘడ్‌కు బయలుదేరారు. సేవాలాల్ ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు నేతృత్వంలో ప్రత్యేక బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని మూడుకొట్ల సెంటర్ నుంచి ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో కలిసి సేవాఘడ్‌కు ర్యాలీగా బయలుదేరారు. అదే సమయంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ తన అనుచరులు, బీఆర్ఎస్ నేతలతో కలిసి సేవాఘడ్‌కు బయలుదేరారు. రెండు వర్గాల మధ్య ఎలాంటి ఘర్షణ వాతావరణం చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీసులు కొద్దిదూరం వచ్చాక ఎల్ఐసీ బిల్డింగ్ సమీపంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమం అయిన తర్వాత పంపిస్తామంటూ సర్దిచెప్పారు. దేవుడి కార్యక్రమానికి వెళ్తుంటే తమను అడ్డుకోవడం ఏమిటని మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అధికారులను ప్రశ్నించారు. ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ప్రభుత్వ అధికారులు ర్యాలీగా సేవాఘడ్‌కు చేరుకుని సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆరంభించారు. అధికారిక వేడుకలు పూర్తయ్యాక మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌ను భారీ బందోబస్తు నడుమ సేవాఘడ్‌కు తీసుకువెళ్లారు. ఆయన సైతం సేవాలాల్ మహరాజ్‌కు మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, డీఎస్పీ తిరుపతిరావు నేతృత్వంలో నలుగురు సీఐలు, పది మంది ఎస్సైలు, 50 మంది పోలీస్ సిబ్బంది, 200 మంది స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ప్రశాంత వాతావరణంలో సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహణకు కృషి చేసిన పోలీస్ అధికారులకు, సహకరించిన ప్రజలకు జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందనలు తెలిపారు.



మహబూబాబాద్‌లో ఎల్ఐసీ ఆఫీస్ వద్ద మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

ఆస్తుల బదిలీ..

- 'పంచాయతీ'ల నుంచి పురపాలకానికి మార్పు
- ఇప్పటికే కొత్త 'టీ పిన్'ల జారీ పూర్తి
- మునిసిపాలిటీ పరిధిలో తాత్కాలికంగా నిలిచిన రిజిస్ట్రేషన్లు

కేసముద్రం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మునిసిపాలిటీ విలీన గ్రామ పంచాయతీల్లోని ఆస్తులన్నీ మునిసిపల్ శాఖలోకి బదిలీ అవుతున్నాయి. ఈ బదిలీ కారణంగా సాంకేతిక సమస్యలతో మునిసిపల్ పరిధిలోని జీపీల్లోని ఆస్తులు, ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్లు ఈనెల 7 నుంచి మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిలిచిపోయాయి. గత నెల 25న కేసముద్రం స్టేషన్, కేసముద్రం విలేజి, అమినాపురం, ధన్నసరి, ఎస్టీకాలనీ(సబ్‌స్టేషన్‌తండా) గ్రామపంచాయతీల విలీనంతో కేసముద్రం మునిసిపాలిటీ ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈక్రమంలోనే పురపాలక శాఖకు చెందిన కమిషనర్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్(సీడీఎంఏ) పోర్టల్‌లో కేసముద్రం మునిసిపాలిటీని తాజాగా పొందుపర్చారు. మునిసిపల్ పరిధిలోని ఆస్తులకు ఆస్తి పన్ను గుర్తింపు సంఖ్య (టీపిన్)లు సైతం జారీ చేశారు. ఈ టీపిన్ ఆధారంగానే ఆస్తుల వివరాలు, ఆస్తి పన్ను చెల్లింపులు, బకాయిలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. మునిసిపాలిటీ పరిధిలోని కేసముద్రం స్టేషన్, విలేజి, ధన్నసరి గ్రామపంచాయతీలోని ఇళ్లకు 'టిపిన్'ల జారీ పూర్తికాగా మరో రెండు జీపీల్లో గుర్తింపు సంఖ్యలు, ఖాళీ స్థలాలకు పన్ను(వీఎల్‌టీ) వసూలు చేసేందుకు నెంబర్లు జారీ చేయాల్సిఉంటుంది. మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్ రవీంద్రబాబును టీపిన్‌పై వివరణ కోరగా మునిసిపాలిటీ పరిధిలోకి వచ్చిన ఇళ్లు, ఖాళీ స్థలాల గుర్తింపు సంఖ్యల జారీ కొనసాగుతోందని, రెండు, మూడు రోజుల్లో సాంకేతిక సమస్య పరిష్కారమై యథావిధిగా రిజిస్ట్రేషన్లు కొనసాగుతాయని తెలిపారు.



కేసముద్రం మునిసిపాలిటీ కార్యాలయం

ముగిసిన చింతలగట్టు మినీ జాతర

- సమ్మక్క-సారలమ్మలకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు

గూడూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం చింతలగట్టు.. వట్టివాగు సమ్మక్క-సారలమ్మ మినీ జాతర ముగిసింది. గత నాలుగు రోజుల పాటు వైభవోపేతంగా పూజలందుకున్న వరాల తల్లులు మొక్కల అనంతరం జాతరకు తెరపడింది. శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జాతర సమయం దగ్గర పడుతున్న కొద్దీ భక్తుల రద్దీ పెరిగింది. దీంతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడింది. వనదేవతలను దర్శించుకుని నిలువెత్తు బంగారం (బెల్లం)ను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చింతలగట్టు.. వట్టివాగు సమ్మక్క-సారలమ్మ జాతర ఖాళీ అయింది.. తిరిగి నిశ్శబ్దం ఒడిలోకి చేరుకుంది. జాతర దగ్గర పడుతున్న కొద్దీ భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతూ.. వచ్చింది. ఫిబ్రవరి 12 నుంచి జాతర జరిగే నాలుగు రోజులు భక్తుల రాక పతాక స్థాయికి చేరుకుంది. ఈసారి జాతరకు సుమారు 2.50 లక్షల మంది భక్తులు హాజరైనట్లు జాతర నిర్వాహకులు తెలిపారు.



మండలంలోని చింతలగట్టు వట్టివాగు సమ్మక్క-సారలమ్మ జాతరలో భక్తజనం

నాలుగు రోజుల వేడుక..

నాలుగు రోజుల పాటు చింతలగట్టు జనగూడారంగా మారింది. ఎటు చూసినా జనమే.. జనం. అడుగు తీసి అడుగు వేయలేనంతటి పరిస్థితి. ఒకరికొకరు ఓర్చుకుంటూ పోవాల్సి వచ్చింది. పోటెత్తిన భక్తజనంతో కుగ్రామమైన చింతలగట్టు మహానగరంగా మారింది. జనహోరు తగ్గిపోయింది. చింతలగట్టు తిరిగి నిశ్శబ్ద ఒడిలోకి పోయింది. భక్తులు వేసుకున్న గూడారాలు తొలగించడంతో చెల్లాచెదురుగా పడిపోయిన కర్రలు, భక్తులు పాడేసిన వ్యర్థపదార్థాలు, పేరుకుపోయిన చెత్తాచెదారంతో జనం విడిచిన ఊరులా నిర్మానుష్యంగా కన్పిస్తోంది. నిన్నటి వరకు భక్తులతో సందడిగా ఉన్న చింతలగట్టు బోసిపోయింది. జిల్లాలో అతిపెద్ద ఆదివాసీ జాతర.. చింతలగట్టు.. వట్టివాగు సమ్మక్క-సారలమ్మ జాతర ఆ తల్లుల ఆశీర్వాదంతోనే జయప్రదమైందని పూజారుల కమిటీ అధ్యక్షులు దారం సిద్దు, జాతర కమిటీ అధ్యక్షులు పెనక నాగయ్యలు అన్నారు. జాతర ముగిసిన సందర్భాన్ని పురస్కరించుకుని వారు మాట్లాడుతూ.. ఈసారి కనివినీ ఎరుగని రీతిలో జాతర గొప్పగా సాగిందన్నారు. జాతరకు వచ్చి సహకరించిన ముఖ్య అతిథులకు, అధికారులకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

కోతల్లేకుండా..

» వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు కార్యాచరణ

» ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే పెరిగిన కరెంట్ వినియోగం
» డిమాండ్‌కు తగ్గట్టుగా అందించేలా ఎన్పీడీసీఎల్ ప్రణాళికలు
» అంతరాయాల సమయాల్లో ఇంటర్ లింక్ లైన్ల ఏర్పాటు
» అధికలోడు బదలాయింపునకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు
» నెలాఖరు వరకు అధికారుల వేసవి కార్యాచరణ పూర్తి

రాంనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే ఎండలు దంచి కొడుతున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. దాంతో డిమాండ్‌కు తగ్గట్టుగా.. కోతల్లేకుండా విద్యుత్‌ను అందించడంతో పాటు ఓవర్‌లోడ్ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఈ మేరకు వరంగల్ ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ 5 సర్కిళ్ల పరిధిలో వేసవి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి వేసవిలో మెరుగైన విద్యుత్ అందించే దిశగా అడుగులు వేస్తున్నారు.


అధికారులతో సమీక్ష జరుపుతున్న నోడల్ అధికారి రాజు చౌహాన్ (ఫైల్)

అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, సామర్థ్యం పెంపు

వేసవి కార్యాచరణలో భాగంగా అధిక లోడ్‌ను తగ్గించడంతో పాటు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ ప్రత్యేకమైన చర్యలను చేపట్టింది. అందులో భాగంగా వరంగల్ సర్కిల్ పరిధిలో పోచమ్మ మైదాన్, ఏజే మిల్స్, అలంకానిపేట, రాయపర్తిలోని తిరుమలాయపల్లి, కేశవాపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. శంభునిపేట, ఎలుకుర్తి, గీసుగొండ, ఏనుమాముల, మూడుచెక్కలపల్లిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యంను పెంచారు. సోమారం, కొత్తూరు, రుద్రగూడెం ఫీడర్‌పై పడుతున్న ఓవర్‌లోడ్‌ను బదలాయించారు. రాయపర్తి సెక్షన్‌లోని కేశవాపూర్ సబ్‌స్టేషన్‌లో అంతరాయాలు ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ పద్ధతిలో విద్యుత్ అందించేందుకు 33 కేవీ లైన్‌కు ఇంటర్ లింకింగ్ చేశారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్‌ను తగ్గించేందుకు 124 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, మరో 618 డీటీఆర్‌లపై ఉన్న ఓవర్ లోడ్ తగ్గించే పనులు పురోగతిలో ఉన్నాయని, ఈ నెలాఖరు వరకు పూర్తి చేసేలా పనులు కొనసాగతున్నాయని ఎస్ఈ మధుసూదన్‌రావు తెలిపారు.

హనుమకొండ సర్కిల్ పరిధిలో 56 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయగా, మరో 347 ట్రాన్స్‌ఫార్మర్ల పనులు పురోగతిలో ఉన్నాయి. 11 కేవీ లైన్‌లోని 7 ఫీడర్లలో ఓవర్‌లోడ్‌ను బదలాయించగా, మరో 11 ఫీడర్లలో జరుగుతున్న పనులు పురోగతిలో ఉన్నాయి. కేయూసీ సబ్‌స్టేషన్‌లో అదనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయగా, ఎన్ఐటీ సబ్‌స్టేషన్‌తో పాటు న్యూశాయంపేట సబ్ స్టేషన్‌లో ఓవర్‌లోడ్ పడే రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచే పని కొనసాగుతోంది. మిగిలిన నాలుగు 33 కేవీ లైన్‌లలో ఇంటర్ లింకింగ్ పనులు కొనసాగుతున్నాయి. జనగామ సర్కిల్‌లో ఇంటర్ లింకింగ్ పనుల కోసం పన్నెండు 33 కేవీ లైన్‌లను గుర్తించగా ఒక లైన్‌ను పూర్తి చేశారు. 8 పురోగతిలో ఉన్నాయి. ఒకటి టెండరుకు ఆహ్వానించగా, మిగతా రెండు పంటలు సాగు జరుగుతున్నందున పెండింగ్‌లో ఉన్నాయి. ఐదు సబ్‌స్టేషన్‌లల్లో 5 పీటీఆర్‌లు ఏర్పాటు చేశారు. 132 కేవీ సబ్‌స్టేషన్‌లో పీటీఆర్ సామర్థ్యంను పెంచారు. 32 అడిషినల్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్ (డీటీఆర్) ఏర్పాటు చేయగా, 45 డీటీఆర్‌ల సామర్థ్యంను పెంచారు. మహబూబాబాద్ సర్కిల్ పరిధిలో 69 డీటీఆర్‌లను ఏర్పాటు చేయగా, ఇంటర్ లింకింగ్ లైన్‌లను ఏర్పాటు చేసేందుకు 10 లైన్‌లను గుర్తించగా 6 పూర్తికాగా, 4 లైన్‌లల్లో పనులు కొనసాగుతున్నాయి. పోలేపల్లి సబ్‌స్టేషన్‌లో 2 పీటీఆర్‌లు, గంగారం సబ్‌స్టేషన్‌లో 15 పీటీఆర్‌లను ఏర్పాటు చేశారు. భూపాలపల్లి ములుగు సర్కిల్‌లో 1 పవర్ ట్రాన్స్‌ఫార్మర్, 38 డీటీఆర్‌లు, 12 డీటీఆర్‌ల సామర్థ్యాన్ని పెంచారు.

ప్రత్యేక నోడల్ అధికారులు

వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరగడం సహజం. దానికి తగ్గట్లు ఎలాంటి విద్యుత్ అంతరాయాలు, ఓవర్ లోడ్ లేకుండా ఉండేందుకు కొన్ని నెలల నుంచి ఎన్పీడీసీఎల్ అధికారులు ప్రతీ సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లను పెంచడం, ఇంటర్ లింక్ లైన్‌లను ఏర్పాటు చేయడం, ఫీడర్‌లలోని ఓవర్ లోడ్‌ను బదలాయించడం లాంటి పనులను చేస్తూ వస్తున్నారు. ప్రతీ సర్కిల్‌లో జరుగుతున్న పనులను పర్యవేక్షించడంతో పాటు పనుల్లో పురోగతి సాధించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లకు 15 సర్కిళ్లకు సీఎండీ వరుణ్‌రెడ్డి సీఈ, సీజీఎం స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. అందులో హనుమకొండ నోడల్ అధికారిగా మధుసూదన్ సీఈ (హెచ్‌ఆర్‌డీ), వరంగల్- రాజుచౌహాన్, సీజీఎం (ప్రాజెక్ట్), భూపాలపల్లి- బీకంసింగ్, సీజీఎం (ప్రాజెక్ట్), మహబూబాబాద్- శ్రీధర్, డీఈ (క్యూసీ), జనగామ - టి.సదర్‌లాల్ సీజీఎం (కమర్షియల్) ఉన్నారు.

ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉన్నాం..

వరంగల్ ఎస్ఈ మధుసూదన్‌రావు



రాబోయే మూడు నెలల్లో పెరిగే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకొని సరిపడా మౌలిక సదుపాయాలను ఇప్పటికే చాలావరకు సిద్ధం చేశాం. పవర్ నిలిపివేసినప్పుడు వినియోగదారులకు ఎలాంటి అంతరాయాలు లేకుండా ప్రత్యామ్నాయ పద్ధతి విద్యుత్ సరఫరాను చేసేందుకు ఇంటర్ లింగ్ లైన్‌లను ఏర్పాటు చేశాం. పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పెంచాం. ఓవర్ లోడ్‌లను బదలాయించేందుకు కొత్త ఫీడర్లను ఏర్పాటు చేశాం. అంతరాయాలు, కొరత లేని మెరుగైన విద్యుత్ అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

జిల్లాల వారీగా 9 కేటగిరీల విద్యుత్ కనెక్షన్లు

జిల్లా	సర్వీసులు (అన్నీ కలిపి)
హనుమకొండ	4,84,208
వరంగల్	4,19,318
జనగామ	2,92,650
భూపాలపల్లి	3,00,346
మహబూబాబాద్	3,39,848
మొత్తం	1,83,6370

	2024లో విద్యుత్ డిమాండ్ (మెగావాట్లలో)	వినియోగం (మెగా యూనిట్లలో)
ఫిబ్రవరి 1	1,165	23.69
ఫిబ్రవరి 2	1,182	23.70
ఫిబ్రవరి 3	1,140	23.94
ఫిబ్రవరి 4	1,150	23.27
ఫిబ్రవరి 5	1,204	23.70
ఫిబ్రవరి 6	1,194	24.37
ఫిబ్రవరి 7	1,179	24.97
ఫిబ్రవరి 8	1,181	24.85
ఫిబ్రవరి 9	1,249	25.15
ఫిబ్రవరి 10	1,236	25.06
ఫిబ్రవరి 11	1,184	24.25

	2025లో విద్యుత్ డిమాండ్ (మెగావాట్లలో)	వినియోగం (మెగా యూనిట్లలో)
ఫిబ్రవరి 1	11,324	25.37
ఫిబ్రవరి 2	1,303	25.65
ఫిబ్రవరి 3	1,380	26.27
ఫిబ్రవరి 4	1,390	26.47
ఫిబ్రవరి 5	1,382	26.57
ఫిబ్రవరి 6	1,401	26.72
ఫిబ్రవరి 7	1,440	26.91
ఫిబ్రవరి 8	1,412	26.40
ఫిబ్రవరి 9	1,389	27.11
ఫిబ్రవరి 10	1,410	26.63
ఫిబ్రవరి 11	1,352	27.14


హనుమకొండలో అమ్మకానికి సిద్ధం చేస్తున్న రంజన్లు

మండుతున్న ఎండలు

- అప్పుడే ఏప్రిల్‌ను తలపిస్తున్న పగటి వాతావరణం
- 3 నుంచి 4 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రతలు
- భూపాలపల్లి జిల్లాలో అత్యధికంగా 37 డిగ్రీలు నమోదు

హనుమకొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఎండలు తీవ్రమవుతున్నాయి. రాత్రి సమయాల్లో వాతావరణం చల్లగానే ఉంటున్నా.. మధ్యాహ్నం మాత్రం సూరీడు సుర్రుమంటున్నాడు. ఫిబ్రవరి నెలలోనే ఏప్రిల్ నెలలో ఉండే ఎండలు ఉన్నాయంటూ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇక ముమ్మందు పరిస్థితేంటా అని ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ఫిబ్రవరి నెలలో.. అదీ శివరాత్రికి ముందు చలి ఎక్కువగానే ఉంటుంది. కానీ ఈ సారి ఇందుకు భిన్నంగా ఎండలు దంచికొడుతున్నాయి. రెండు మూడు రోజులుగా వాతావరణం పూర్తిగా మారిపోయింది. పగటి ఉష్ణోగ్రత 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగింది. దీనితో పగటి పూట రోడ్లపై జనసంచార తగ్గింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఎండకు భయపడి ప్రజలు అప్పుడే గొడుగులను ఆశ్రయించడం, టోపీలను ధరించడం కనిపిస్తోంది. అలాగే శీతలపానీయాలు, కొబ్బరిబొండాలు, ఐస్‌క్రీమ్, సోడా బండ్ల తదితర వాటి వద్ద రద్దీ పెరుగుతోంది.


ఎండ తీవ్రతకు గొడుగులను ఆశ్రయిస్తున్న యువత

నమోదైన ఉష్ణోగ్రతలు

శనివారం ఉదయం 12 గంటలకు ఉమ్మడి జిల్లాలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత సరాసరి 36 డిగ్రీలుగా నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్‌లో అత్యధికంగా 37.01 డిగ్రీలు కాగా.. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో 36.8 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో 36.7 డిగ్రీలు, వరంగల్ జిల్లా చెన్నారావుపేటలో 36.6 డిగ్రీలు, హనుమకొండ జిల్లా దామెర మండలం పులుకుర్తిలో 35.8 డిగ్రీలు, జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాలలో 35.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. విక్రయాలకు సిద్ధమవుతున్న రంజన్లు ఎండాకాలం సమీపిస్తుండడంతో చల్లని నీటి కోసం అమ్మకానికి రంజన్లు సిద్ధమవుతున్నాయి. నగరంలో ఆయా చోట్ల రోడ్ల పక్కన విక్రయానికి రంజన్లను అందుబాటులో ఉంచుతున్నారు. సాధారణంగా ఎండలు ముదరక ముందే కొనుగోలు చేస్తే ఫ్రిజ్‌లు, మట్టితో చేసిన రంజన్లు, కుండలు, కూలర్లు తక్కువ ధరకు దొరుకుతాయి. అందుకే ప్రజలు ఒకింత ముందుగానే వీటిని కొనుగోలు చేస్తారు.

శనివారం




సేద దీరిన.. శంకర్

ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం రాత్రి సమయాల్లో వాతావరణం చల్లగానే ఉంటున్నా.. మధ్యాహ్న సమయంలో మాత్రం సూరీడు సుర్రుమంటున్నాడు. దీంతో జంతువులు సైతం అల్లాడుతున్నాయి. ఈ క్రమంలో హనుమకొండ వనవిజ్ఞాన్ జూపార్క్‌కు ఇటీవల తీసుకొచ్చిన రెండు పెద్ద పులుల్లో ఒకటైన 'శంకర్' ఇదిగో ఇలా నీటి కొలనులో సేదదీరి.. బయటకొచ్చి జలదరించిన దృశ్యాలివీ.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

నెరవేరిన 17 ఏళ్ల పోరాటం

- 2008 డీఎస్సీ బాధితులకు కాంట్రాక్టు ఉద్యోగం
- నియామక పత్రాలను అందుకున్న అభ్యర్థులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 182 మందికి అవకాశం

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పదిహేడేళ్లుగా చేస్తున్న పోరాట ఫలితంగా 2008 డీఎస్సీ బాధిత అభ్యర్థులు ఎట్టకేలకు కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా శనివారం నియామక పత్రాలను అందుకున్నారు. 2008 డీఎస్సీ బాధిత అభ్యర్థులకు కాంట్రాక్టు టీచర్ ఉద్యోగాలు కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,382 మంది బాధిత అభ్యర్థులకు కాంట్రాక్టు ఉద్యోగాలు కల్పిస్తుండగా.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 182 మందికి అవకాశం దక్కింది. అయితే మారుమూల ప్రాంతాల్లోని ఖాళీల్లోనే వీరికి అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 182 మందికి ఆయా జిల్లాల డీఈవోలు శనివారం నియామక పత్రాలు అందజేశారు.

2008 డీఎస్సీలో ఏం జరిగింది?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008లో అప్పటి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించగా, రాత పరీక్ష అనంతరం నియామక సమయంలో రాష్ట్ర హైకోర్టు బీఈడీ అభ్యర్థులను ఎస్జీటీ పోస్టుల్లో భర్తీ చేయరాదనే తీర్పును వెలువరించింది. నోటిఫికేషన్‌లో పొందుపరిచిన విధానాలను అనుసరించి పోస్టులను భర్తీచేయాలని, అందుకు విరుద్ధంగా కోర్టు తీర్పు ఉందని బాధిత అభ్యర్థులు తిరిగి హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి సమస్య కొనసాగుతూనే ఉంది. కాగా, ఇటీవలే ఆంధ్రప్రదేశ్‌లో 2008 డీఎస్సీ బాధితులకు అక్కడి ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులుగా నియమించింది. దీంతో తెలంగాణ రాష్ట్రంలోనూ బాధితులకు న్యాయం చేయాలని అభ్యర్థులను హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు బాధిత అభ్యర్థులను కాంట్రాక్టు ఉపాధ్యాయులగా నియమించాలని ప్రభుత్వ ఆదేశించింది. దీంతో విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ. నర్సింహారెడ్డి కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా శనివారం నియామక పత్రాలు అందజేయాలని జిల్లా కలెక్టర్లు, డీఈవోలకు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

అసంతృప్తితోనే అంగీకారం

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2008 డీఎస్సీ బాధిత అభ్యర్థులు సుదీర్ఘకాలంగా పోరాటాలుచేసి కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా చేరాలనే ప్రభుత్వ ఉత్తర్వులను వారు అసంతృప్తినే అంగీకరించారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో పొందుపరిచిన నిబంధనల మేరకు నియామకాలు చేపట్టాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా బీఈడీ అభ్యర్థులను అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తామని అనుకుంటే కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా సర్దుకుపోవాల్సిన దుస్థితి దాపురించిందని మదనపడుతున్నారు. మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల్లోనే అవకాశాలు కల్పించడంపై కూడా పెదవి విరుపుగానే ఉన్నారు.

ఉద్యోగం ఇలా..

2008 డీఎస్సీ బాధితులను కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా ప్రతీ నెల రూ. 31,040 వేతనంతో నియమించారు. వీరి సర్వీస్ ప్రతీ విద్యా సంవత్సరం చివరి రోజున ముగిసి, విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విద్యాశాఖ అవసరాలకు అనుగుణంగా నియామకం చేసుకుంటారు. పూర్తి స్థాయిలో వీరిని కాంట్రాక్టు ఉపాధ్యాయులుగానే వారికి కేటాయించి విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది.

మారుమూల ప్రాంతాలే దిక్కు

కాంట్రాక్టు పద్ధతిలోనైనా దగ్గరలోని ఖాళీల్లో పోస్టు దొరుకుతుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులుగా వారిని మారుమూల పాంతాల్లోని పాఠశాలల్లో నియమించారు. పట్టణ ప్రాంతాల్లోని హెచ్‌ఆర్ఏ ఉన్న ఖాళీల్లో కాంట్రాక్టు ఉపాధ్యాయులను భర్తీ చేయలేదు. హెచ్‌ఆర్ఏ పోస్టుల్లో కాంట్రాక్టు ఉద్యోగులను భర్తీ చేస్తే వారికి ఎలాంటి లాభం లేదనే అభిప్రాయాన్ని ఉపాధ్యాయ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.


నియామక పత్రాలను అందజేస్తున్న డీఈవో వాసంతి

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లా పేరు	డీఎస్సీ 2008 కాంట్రాక్టు ఉపాధ్యాయులు
వరంగల్	8
హనుమకొండ	18
జనగామ	33
జయశంకర్ భూపాలపల్లి	43
మహబూబాబాద్	52
ములుగు	28
మొత్తం	182

ముగిసిన మినీ సంబురం

➡ చివరి రోజూ గద్దెల వద్ద జనం సందడి
➡ నాలుగు రోజుల్లో సుమారు 10 లక్షల మంది భక్తుల రాక
➡ తిరుగు వారం పండుగకు సిద్ధమవుతున్న పూజారులు


తల్లుల గద్దెలను దర్శించుకుంటున్న దృశ్యం


జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

తాడ్వాయి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మేడారం మినీ సంబురం ముగిసింది. చిన్న జాతర ముగియడంతో పూజారులు వచ్చే బుధవారం నిర్వహించబోయే తిరుగువారం పడుగకు పూజారులు సిద్ధమవుతున్నారు. 12వ తేదీ బుధవారం మండమెలుగు పండుగతో ప్రారంభమైన మినీ జాతరకు భక్తులు పోటెత్తారు. ఈ నాలుగురోజుల్లో సుమారు 10లక్షల మంది తల్లుల దర్శనానికి తరలివచ్చారని, చివరిరోజైన శనివారం 50వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఎత్తు బంగారం(బెల్లం), ముడుపులు, యాట మొక్కులు సమర్పించుకున్నారు. భక్తులకు తల్లుల దర్శనాలను సులువుగా జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా జాతర ముగిసినా సెలవు రోజైన ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారని అధికారులు అంచనా వేశారు. ఈ నాలుగురోజుల పాటు జరిగిన మినీ జాతరకు ఈ క్రమంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సేవలు అందించామని దేవస్థానం ఈవో రాజేంద్ర తెలిపారు. జాతరను విజయవంతం చేసిన పూజారులు, అధికార యంత్రానికి, పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు సేవలు భేష్

మేడారం మినీ జాతరలో పోలీసులు కీలకపాత్ర పోషించారు. పటిష్ఠ బందోబస్తు చేయడంతోపాటు రద్దీని కంట్రోల్ చేయడంలో సమర్థవంతంగా పనిచేశారని పలువురు అభినందిస్తున్నారు. పోలీసులు రద్దీని క్రమబద్ధీకరించడం వల్లే తాము గతంలో ఎన్నడూ లేని విధంగా సమ్మక్క- సారలమ్మల గద్దెపైకి వెళ్లి దర్శనాలు చేసుకున్నామన్నారు. తల్లులను జాతరలో తాకి మొక్కులు చెల్లించుకోవడం సంతోషాన్ని కలిగించిందని అన్నారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ రవీందర్ నేతృత్వంలో పటిష్ఠ చర్యలు చేపట్టామని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గత మినీ జాతరలో 250 మంది పోలీసులతో బదోబస్తు చేపడితే ఈసారి 500 మంది సేవలన వినియోగించుకున్నామని అన్నారు. వీఐపీలు, వీవీఐపీల దర్శనా సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

భక్తులకు మెరుగైన వైద్యం

మేడారంలో మినీ జాతర సందర్భంగా భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో ఆరోగ్య శాఖ విజయం సాధించిందని డీఎంహెచ్‌వో గోపాల్ రావు తెలిపారు. ఈ క్రమంలో జాతర పరిసరాల్లో మూడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 1,350 మందికి వైద్య సేవలు అందించామన్నారు. 20 మందికి ప్రథమ చికిత్సలు అందించి జిల్లా ఏరియా ఆస్పతికి ఏర్పాటు చేసిన రెండు అంబులెన్స్‌లతో వేరు వేరు సమయాల్లో తరలించినట్లు తెలిపారు. 180 రకాల మందులతో మేడారంలో భక్తులు మెరుగైన వైద్య సేవలను అందించామన్నారు.

నేడు కూడా ఆర్టీసీ సేవలు

మేడారం మినీ జాతర సందర్భంగా వనదేవతలను దర్శించుకొనే భక్తులకు ఆదివారం తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ (టీజీ ఆర్టీసీ) బస్సులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. వారాంతపు సెలవు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశాలు ఉన్నాయని, దర్శనాలు కొనసాగుతాయని వివరించారు.

బయ్యక్కపేటలో వనం చేరిన వనదేవత

తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో వనదేవత సమ్మక్క తల్లిని పుట్టు పూర్వ ఇలవేల్పుగా చంద వంశీయులు కొలుస్తారు. తమ ఆడబిడ్డగా జన్మించిందని నమ్మెతారు. ఈ క్రమంలో పురాతన కాలం నుంచి ఆచారంగా వస్తున్న వనదేవత జాతర గురువారం గద్దెపై ప్రతిష్ఠించి శనివారం వనప్రవేశం తంతు ముంగించారు. ఈ జాతరలో సుమారు 5 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెలించుకున్నారని అధికారులు తెలిపారు. అదేవిధంగా తిరుగువారం పండుగా వచ్చే బుధవారం జరుపుకొని మళ్లీ వచ్చే ఆదివారం పూజారులు, గ్రామస్తులు, ఆదివాసీలు వనభోజనాలు చేయడం ఆనవాతీ. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి రాజేంద్రం సిబ్బంది, పూజారులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


గొడుగు నీడలో చిన్నారితో గద్దెల వద్దకు వస్తున్న భక్తురాలు


గద్దెల ప్రాంగణంలో సెల్ఫీ దిగుతున్న యువతులు


వనదేవతలకు ఎదురు కోడి మొక్కులు చెల్లిస్తున్న భక్తురాలు

ముగిసిన ఐలాపూర్ జాతర

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐలాపూర్‌లో నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన సమ్మక్క, సారలమ్మ జాతర శనివారంతో ముగిసింది. గద్దెల వద్ద నుంచి పూజారులు, వడ్డెలు, గ్రామస్థులు దేవతామూర్తులను వనప్రవేశం చేయించారు. సమ్మక్క దేవత గద్దెల వద్ద ప్రధాన పూజారి మల్లెల మధు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, సారలమ్మ గుడి వద్ద సర్వాయి గ్రామానికి చెందిన మూడో గొట్టు నల్లబోయిన వంశీయులు పూజారులు నల్లబోయిన మోహన్‌రావు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డోలు వాయిద్యాల నడుమ గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారం ముందుగా సారలమ్మను సర్వాయి గ్రామానికి తీసుకొచ్చి వన ప్రవేశం చేయించారు. అనంతరం సమ్మక్క దేవతను కొండాయి, ఐలాపూర్ మధ్యలోని దట్టమైన అటవిలో ఉన్న దేవుని గుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వన ప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఐలాపూర్ గ్రామంలోని గ్రామస్థులు యువతీ, యువకులు రోడ్డు మీద అడ్డంగా పడుకోగా వీరి మీది నుంచి దేవర బాలలు నడుచుకుంటూ వెళ్లారు.


వన ప్రవేశం కోసం తల్లులను తరలిస్తున్న పూజారులు

ఈ కార్యక్రమంలో పూజారులు, వడ్డెలు మల్లెల రాఘవయ్య, బాబు, యాదగిరి, పీరీల భాస్కర్ , పీరీల సురేష్, కోడె తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి


హేమాచలుడి మూలవిరాట్

మంగపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచు లక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామి సన్నిదిలో శనివారం సందడి నెలకొంది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి దర్శనాలు చేసుకున్నారు. ఉమ్మడి వరం గల్ జిల్లాల నుంచే కాకుండా పొరుగు జిల్లాలు, ఇతర సుదూర ప్రాంతాల నుంచి సుమారు 15 వేల మంది స్వామివారిని దర్శిం చుకున్నారు. కొండపైకి చేరి చింతామణి జలదారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి జలాంజనేయస్వామి, పంచము ఖాంజనేయస్వామి, వేణుగోపాలస్వామి, రమ సత్యనారాయణస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపై కొలువుదీరిన లక్ష్మీనరసింహ స్వామిని, పక్కనే ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధానా ర్చకుడు ముక్కమల్ల రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పవన్ కుమారాచార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మ, అనిపెద్ది మురళికృష్ణశర్మ, వెంకటనారాయణ శర్మ మూలవిరాట్‌కు తిలా, తైలాభిషేకాలు చేసి గజమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దైవ దర్శనాలు గావించారు.

ప్రజాభీష్టం మేరకే స్థానిక ఎన్నికల్లో అవకాశం : ఎమ్మెల్యే గండ్ర

టేకుమట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజాభిప్రాయం మేరకే స్థానిక ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ అధ్యక్షతన శనివారం జరిగిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావే శంలో ఎమ్మెల్యే మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాభిప్రాయం మేరకే పోటీకి అవకాశం కల్పిస్తామన్నారు. గ్రామంలోని ప్రజలు ఎవరిని కోరుకుంటే వారికే అవకాశం ఇస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు జవాబుదారీతనంగా పని చేసేవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. పాత, కొత్త తేడాలేమీ ఉండవన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.600 కోట్లు మంజూరు చేయించానన్నారు. టేకుమట్ల మండలం ఏర్పాడి ఏడేళ్లు పూర్తయినా ప్రభుత్వ కార్యాలయాలు గత పాలకులు ఎందుకు నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. గ్రామాల్లో కాంగ్రెస్ ప్రజాపాలన గురించి ప్రజలకు కార్యకర్తలు వివరించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, మాజీ జడ్పీటీసీలు పులి తిరుపతిరెడ్డి, ఓరం సమ్మయ్య, జిల్లా, మండల నాయకులు దాసారపు సదానందం, మాదం కొమరయ్య, మోతే రాజమౌళి, తోడేటి కుమార్, తోట గట్టయ్య, సంపత్, వంగ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరుతల రామాయణం ప్రారంభం

మల్లూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లారంలో చిరుతల రామాయణం ప్రారంభించినట్లు నిర్వహకులు తెలిపారు. గురువు తాళ్లపెల్లి సంపత్, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఇది కొనసాగుతున్నట్లు చెప్పారు. రెండు రోజులగా రాత్రి పూట సాగుతున్న ఈ కార్యక్రమానికి గ్రామస్తులు అదిక సంఖ్యలో హజరు వుతున్నట్లు తెలిపారు. 18న శ్రీ సీతారామ పట్టాభిషేకంతో కార్యక్రమం ముగియనున్నట్లు తెలిపారు.

అవినీతిని వెలికితీసేందుకే సామాజిక తనిఖీ

అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటనారాయణ


ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

వెంకటాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో జరిగిన అవినీతిని వెలికితీసేందుకే సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామని డీఆర్డీవో ఏపీడీ వెంకటనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం జరిగిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన సుమారు 272 పనులకు కూలీలకు రూ.2 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. ఇందులో రూ. 26,832 రికవరీ చేసినట్లు తెలిపారు. సామాజిక తనిఖీ బృందంవారంరోజులుగా గ్రామాల్లో తిరుగుతూ చేపట్టిన సామాజిక తనిఖీ వివరాలను ప్రజావేదికలో వెల్లడించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మూడ్ రాజునాయక్, ఏపీవో నారగోని సునీత, డీవీసీ సాంబయ్య, ఎస్ఆర్‌పీ రజిత, సోషల్ ఆడిట్ ఏపీసీ అంజగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి : ఏఐకేఎంఎస్

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు బొమ్మెడ సాంబయ్య, కుర్రి ఐలయ్య కోరారు. ములుగులో శనివారం జరిగిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం చేసిన హామీలు 14నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోవడంలేదని అన్నారు. కేసీఆర్ పాలనలో దగా పడిన తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టేలా కాంగ్రెస్ పాలన ఉందని విమర్శించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్, చిరంజీవి, దాసు, ఈశ్వరమ్మ, రమ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చలో హైదరాబద్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ములుగులోని 11కేవీ కోస్టల్ ఫీడర్‌లో మరమ్మతులు ఉన్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ బి.రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు పట్టణంలోని కృష్ణకాలనీ, బీడీకార్మికుల ప్రాంతం, బండారుపల్లి పెట్రోల్ బంకు, గురుకులం, మోడల్‌స్కూల్, పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

'యాదవుల జనాభాను తక్కువగా చూపడం సరికాదు'

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం యాదవ జనాభాను తక్కువగా చూడడం సరికాదని తెలంగాణ యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి కోరె రవియాదవ్ అన్నారు. జిల్లాకేంద్రంలో మాదం సాగర్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ కుల గణనలో ప్రభుత్వ కుట్రలు దాగి ఉన్నాయని, కుల గణను తక్కువగా చూపెట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులను రాజకీయంగా అణచివేయాలని చూస్తుందని అన్నారు. ఇప్పటికైనా యాదవ కుల గణన సరిగా చేపట్టి జనాభా లెక్కల ప్రకారం సీట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు మర్రి గట్టయ్య, బుచ్చయ్య, సమ్మయ్య, మండల అధ్యక్షుడు గొర్రె శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు భైకాని విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు చేయూత

వాజేడు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రధాన వంట మనిషిగా విధులు నిర్వర్తిస్తున్న దుబ్బా కృష్ణవేణి(50) అనారోగ్యంతో శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందారు. ఈ క్రమంలో విద్యాశాఖ ఉన్నతాధికారుల సూచన మేరకు ఆమె కుటుంబ సభ్యులకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ. 30వేల నగదును హెచ్ఎం బద్రి శనివారం అందజేశారు. ఉపాధ్యాయులు నర్సింగరావు, బాలాజీలు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి సాయం

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మల్లంపల్లిలోని జడ్పీహెచ్ఎస్‌లో 2004-05 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తిచేసిన తోటి మిత్రుడు స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా అతడి కుటుం బానికి అప్పటి తోటి విద్యార్థులు శనివారం రూ.22వేల ఆర్థికసాయం అందజే శారు. ఈ కార్యక్రమంలో సునీల్, నరేష్, కంచం కుమార్, పరిపూర్ణాచారి, సతీష్, సలీంపాషా, శ్రీమాత, నాగరాజు, శేఖర్, రాజేందర్, శివ పాల్గొన్నారు.

పోచమ్మగుడిని తొలగించొద్దని వినతి

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ములుగు జిలా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న పోచమ్మగుడిని అభివృద్ధి పేరిట తొల గించొద్దని కోరుతూ ములుగు ప్రజలు శనివారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామదేవతగా వెలసిన పోచమ్మతల్లి గుడిని అధికారులు తొలగిస్తామనడం సబబుకాదని అన్నారు. పోచమ్మతల్లి జిల్లాకేంద్రానికి అంగరక్షకురాలిగా ఉంటూ ప్రజల యోగక్షేమాలు చూసుకుంటుందని, అలాంటి గుడిని తొలగిస్తే అపచారమవుతుందని అన్నారు. గ్రామ శ్రేయస్సు కోరుతూ ప్రజలకు మంచి జరగాలంటే యధావిధిగా పోచమ్మగుడి అక్కడే ఉండాలని కోరారు. మంత్రి సీతక్క కలుగజేసుకుని ప్రజల బాగుకోసం ప్రయత్నించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏరువ పూర్ణచందర్, నేరెళ్ల శంకర్, రేసోజు శ్రీధర్, జోలి రమేష్, కూన సుదర్శన్, గాధం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలి

మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని భూపాలపల్లి పట్టణ ప్రజలకు మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ కోరారు. శనివారం ఆయన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పన్నుల వసూళ్ల కోసం తొమ్మిది బృందాలను ఏర్పాటు చేయగా, అన్ని కాలనీల్లో ఇంటింటికీ తిరిగి ఇంటి పన్ను వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే పట్టణంలోని బిట్స్ పాఠశాలకు చెందిన ఇంటి పన్ను బకాయి రూ.4.37 లక్షలు వసూలు చేశారు. మార్చి మాసాంతం వరకు లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

బహుజన ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 90 శాతం ఉన్న బహుజన అభ్యర్థి దామెర బాబురావును గెలిపించాలని డీటీయూ నాయకులు శ్యాంసుందర్, సురేష్ భూపాలపల్లిలో ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ఉపాధ్యాయుల ఇంటింటికీ వెళ్లి ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో ఓటు వేసి బాబురావును గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో ధర్మ టీచర్స్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ బొల్లె సాంబయ్య, డీటీయూ హనుమకొండ కన్వీనర్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మాజీ ఎమ్మెల్యే

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మొక్కలు నాటారు. శనివారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చారని గుర్తు చేశారు. అనంతరం సంత్‌సేవాల్ జయంతిని పురస్కరించుకొని సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'చిన్న కాళేశ్వరం' భూసేకరణ వేగవంతం చేయాలి

కాటారం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన రిజర్వాయర్లు, కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం కోసం భూసేకరణ పనులు వేగవంతం చేయాలని రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్ అధికారులను అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని గారెపల్లి, కాటారం, ఆదివారంపేట, గుమ్మళ్లపల్లి, వీరాపూర్ గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. చెరువులు, కాల్వల కోసం సర్వే చేసిన భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ వెంకన్న తదితరులు ఉన్నారు.

రైతులు ఆర్థికాభివృద్ధిని సాధించాలి

మహాముత్తారం, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి గ్రామంలో రైతులతో టీడీఎఫ్, ఎఫ్‌పీవో కమిటీల డైరెక్టర్లు శనివారం సమావేశమయ్యారు. నాబార్డు ఆర్థిక సహకారంతో షార్ప్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతంలోని రైతుల ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో పని చేస్తున్నామని అధికారులు అన్నారు. రైతులు ప్రతి అవకాశాన్నీ వినియోగించుకొని మరింత అభివృద్ధిలోకి రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో షార్ప్ ప్రాజెక్టు మేనేజర్ విజయ్, ఎవో అనుషా, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సంతోష్, ఎఫ్‌పీవోలు దామోదర్, శ్రీకాంత్, శేఖర్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ ఉచ్చులు పెడితే కఠిన చర్యలు

కాటారం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పంట పొలాల చుట్టూ, అడవుల్లో విద్యుత్ ఉచ్చులు పెట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని కాటారం ఎస్సై అభినవ్, తహసీల్దార్ నాగరాజు పలువురిని హెచ్చరించారు. మండలంలోని గుండ్రాత్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నలుగురు వ్యక్తులకు ఉచ్చులు పెడుతున్నారనే అనుమానంతో పోలీస్, అటవీశాఖ అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. విద్యుత్ ఉచ్చులతో అడవి జంతువులను వేటాడితే చట్టప్రకారం కఠిన శిక్షలుంటాయని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ఎదుట రూ.2 లక్షల మేర బైండోవర్ చేశారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలతో పాటు రూ.2లక్షల జరిమానా కట్టాల్సి ఉంటుందని తహసీల్దార్ నాగరాజు, ఎస్సై అభినవ్, ఎఫ్ఎస్‌వో చంద్రశేఖర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో దళితులకు హక్కులు కల్పించాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో దళితులకు భూములపై పూర్తిగా హక్కులు కల్పించాలని ఏజెన్సీ దళితుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిప్పనపల్లి సుదర్శన్ ప్రభుత్వాన్ని కోరారు. భూమిపై హక్కులు కల్పించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ భూములపై హక్కులు లేకపోవడం వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీని వల్ల వారు అభివృద్ధికి అమడ దూరంలో అనేక సమస్యలతో పడరాని పాట్లు పాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో దళితులు ఉపాధి కోసం పట్టణాలకు వలస పోతున్నారని, దీంతో వారి జీవన విధానం మరింత దిగజారుతోందన్నారు. పోడు వ్యవసాయం చేసుకునే దళితులకు పట్టాలు రావడంలేదని, అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ దళితుల సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యల నర్సింహారావు, మండల అధ్యక్షుడు మామిడి రాంబాబు, కూరపాటి కుమారస్వామి, మేడి సతీష్, దేపాక శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని పస్రాలో టీఎస్ టీఈఏ జిల్లా అధ్యక్షుడు భూక్య సక్రునాయక్ ఆధ్వర్యంలో సద్గురు సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా వారు సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం టీఎస్‌టీఈఏ జిల్లా అధ్యక్షుడు సక్రునాయక్, ఎల్‌హెచ్ పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్.సీతారాం నాయక్, మండల అధ్యక్షుడు నర్సింహనాయక్ మాట్లాడుతూ బంజారాలు సేవాలాల్ మహారాజ్ మార్గాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగిం చాలన్నారు. ఈకా ర్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, నాయకులు పులుగుజ్జు వెంకన్న, జెట్టి సోమయ్య, పంగ శ్రీను, శ్రీకాంత్, లకావత్ నర్సింహ, ధరావత్ పున్నంనాయక్, పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ ఆవరణలో, గిరిజన సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పరిషత్‌లో బంజారా సేవా సంఘం అధ్యక్షుడు రమేష్ నాయక్ ఆధ్వర్యంలో నాయ కులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి సంబరాలు


సేవాలాల్ మహరాజ్ చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న బంజారాలు

జరుపుకున్నారు. ఎస్టీ గురుకులంలో ప్రిన్సిపాల్ రాజేందర్, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించారు. కళాశాల సేవాలాల్ కమిటీ అధ్యక్షుడు హరిభూషణ్ ఆధ్వర్యంలో భోగ్ బండార్ జరిపారు. వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి, వెంకట య్య, అధ్యాప కులు నరేష్, రాజు, నర్సింహ, సర్దార్‌సింగ్, స్వాతి, బోధనేతర సిబ్బంది వీరయ్య, మల్లయ్య, సత్యనా రాయణ, మధు, శ్రీను, బంజారా సేవాసంఘం నేతలు రవీందర్‌నాయక్, రాములు, కిషన్‌నాయక్, దేవానాయక్, సమ్మయ్య, రాజు, రమేష్, సకారాం, గోపి, పరం సింగ్, రాజారాం, జైపాల్, జితేందర్, విఠల్ పాల్గొన్నారు.

ఏయ్.. ఎవరే నువ్వు?

ప్రేమలు, పగలు మనుషులకే కాదు.. జంతువులు, పక్షులకూ ఉంటాయి. ఈ జీవరాసుల్లో కోపతాపాలనేవి అతి సహజం. ఈ ఊర పిచ్చుకను చూస్తే అదే అనిపిస్తుంది. బుల్లెట్ బైక్‌పై ఎక్కి హ్యాండిల్‌కు ఉన్న అద్దంలో తనను తానే చూసుకుంది. తన ప్రతిబింబాన్ని చూసి శత్రువు అనుకుందో.. తన లాంటి జీవి వచ్చిందని ఆనందపడిందో తెలియదు గానీ.. అద్దాన్ని ముక్కుతో పొడవసాగింది. ఇలా తరచూ ఆ వాహనం వద్దకు రావడం, ముక్కుతో పొడవడం దానికి పరిపాటిగా మారింది. ఈ దృశ్యం కాటారం మండలంలోని రేగులగూడెంలో ఓ ఫెర్టిలైజర్ షాపు ఎదట కనిపించింది.



- కాటారం (ఆంధ్రజ్యోతి)

ఇసుక లారీని పట్టుకున్న పోలీసులు

ములుగు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని ములుగు పోలీసులు శనివారం పట్టుకున్నారు. మల్లంపల్లిలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ లారీ ఓవర్‌లోడ్‌తో అతివేగంతో రాగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. లారీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు

వాజేడు (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ హెచ్చరించారు. శనివారం ఆయన స్టేషన్ పరిధిలోని రాంపురం, భీమారం ఇసుక క్వారీలను రెవెన్యూ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఇసుక లారీల యజమానులు డీడీలు లేకుండా తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. అదే విధంగా క్వారీల నిర్వహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ఒక లారీకి బదులు మరొక దానిలో ఇసుకను తరలించినా, ఓవర్ లోడ్ ఉన్నా, జేసీబీ లోడింగ్ చార్జీల పేరుతో అక్రమ వసూళ్లు చేసినా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

మూల్యాంకనాన్ని పరిశీలించిన విద్యా శాఖ అధికారులు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో జరుగుతున్న అంతర్గత మూల్యాంకనాన్ని విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. శనివారం చల్వాయి కేజీబీవీ, హైస్కూల్, మండలకేంద్రంలోని మెరిట్ హైస్కూల్, కర్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆశ్రమ ఉన్నత పాఠశాల, దుంపెల్లిగూడెం హైస్కూల్, తదితర పాఠశాలలను సందర్శించి పదోతరగతి విద్యార్థుల రికార్డులు, మార్కుల గ్రేడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గొంది దివాకర్, పరిశీలకులు షేక్ హాజీనూరానీ, తిరునగరి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా సరోత్తంరెడ్డిని గెలిపించుకోవాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో టీపీయూఎస్ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి కోరారు. ములుగులోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం శనివారం జరగ్గా ఆయన మాట్లాడారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వికసిత్ భారత్ లక్ష్యంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ వెన్నంపల్లి పాపన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణి, రాష్ట్ర ఎస్టీమోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, ములుగు జిల్లా ఎమ్మెల్సీ కన్వీనర్ కొత్త సుధాకర్‌రెడ్డి, నాయకులు శీలమంతుల రవింద్రచారి, జినుకల కృష్ణాకర్‌రావు, గుగులోత్ స్వరూప, రాయంచు నాగరాజు, పైడాకుల మల్లేష్, మార్క సతీష్, లక్ష్మణ్‌రావు, జానకిరాం, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం

మంగపేట (ఆంధ్రజ్యోతి): మంగపేటలోని బీజేపీ కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు రావుల జానకీరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం హాజరయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రశ్నించే బీజేపీకి మొదటి ప్రాధాన్య ఓటు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో, ప్రభారి పాపన్న, జినుకల కృష్ణాకర్ రావు, ఏనుగు రవిందర్‌రెడ్డి, కొత్త సుధాకర్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాసరావు, జాడి వెంకట్, జిల్లా లోడే శ్రీనివాస్‌గౌడ్, ఎమ్డీ. యాకూబ్‌పాషె తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన శ్రీనివాస్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభా కర్‌ను రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ శనివారం సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను మంత్రి శాలువా కప్పి అభినందించారు. జిల్లాలో నెలకొన్న పలు సమస్య లను పరిష్కరించాలని మంత్రికి శ్రీనివాస్ విన్నవించారు.


వసంత శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

త్రీఫేజ్ కరెంటు సరఫరా చేయాలని ఆదివాసీల ఆందోళన

వాజేడు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నివాసం ఉంటున్న పెనుగోలు కాలనీ ఆదివాసీలు శనివారం తమ కాలనీలో త్రీఫేజ్ విద్యుత్ లైను ఏర్పాటు చేయాలని ఆందోళన నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులు పెనుగోలు కాలనీ సమీపంలోని జంగాలపల్లిలో కొంత మేర త్రీఫేజ్ విద్యుత్ లైనుకు సంబంధించి స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో తమ కాలనీలో కూడా ఏర్పాటు చేసి త్రీఫేజ్ సరఫరాను చేయాలని విద్యుత్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా ఆదివాసీలు మాట్లాడుతూ గుట్టలపై ఉన్న తమను సుమారు 20 ఏళ్ల క్రితం కిందికి దించి మండల కేంద్రంలో నివాసం ఏర్పాటు చేశారని, మౌలిక సౌకర్యాలు కల్పించడంలో మాత్రం అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న విద్యుత్ స్తంభాలు కూడా సరిపడా సంఖ్యలో లేవని, అడిగితే సొంతంగా డబ్బులు కట్టి వేయించుకోమని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని, తమకు న్యాయం చేయాలని అన్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతే ప్రస్తుతం జంగాలపల్లి వరకు త్రీఫేజ్ విద్యుత్ లైను మంజూరైందని, త్వరలోనే పెనుగోలు కాలనీ వరకు విస్తరిస్తామని సర్ది చెప్పారు.